సాక్షి విశాఖపట్నం

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



ఆర్టీసీ డ్రైవర్లపై గురుతర బాధ్యత

8లో



ఘనంగా వాస్తు యజ్ఞం

8లో



బేస్ విక్చువలింగ్ యార్డ్ ప్లాటినం జూబ్లీ వేడుకలు

8లో

న్యూస్‌రీల్

దేశ రక్షణలో పరిశోధనా సహకారం అందించండి

- ఏయూని కోరిన తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా



వర్సిటీ అధికారులతో సమావేశమైన సమీర్ సక్సేనా

విశాఖ విద్య: దేశ రక్షణలో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లను అధిగమించే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధన సహకారం అందించాలని తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా అన్నారు. శుక్రవారం ఆయన తన బృందంతో వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. శశిభూషణరావుతో సమావేశమయ్యారు. రక్షణ రంగానికి అవసరమైన వివిధ పరిశోధన సంబంధిత అవసరాలపై చర్చించారు. శత్రుదేశాల నుంచి తమకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించడానికి, పరిష్కరించడానికి అవసరమైన శాస్త్రీయ అధ్యయనాలు జరిపి సూచనలు అందించాలని ఏయూను కోరారు. ఏయూ ముందుకు వస్తే తాము దీనికి అవసరమైన ప్రాజెక్టులను మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, పలువురు ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో ఎంఎం కీరవాణి



దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి శుక్రవారం దర్శించుకున్నారు. దేవీపురంలోని దత్త గురుపీఠం, కామాఖ్య శక్తి పీఠం, శ్రీయంత్ర మహామేరులోని కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి అమ్మవార్ల ప్రతిరూపాలను ఆయన సోదరుడు కాంచితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వారాహి సహిత చండీ హోమంలో పాల్గొన్నారు. ట్రస్టు నిర్వహిస్తున్న అమృత కన్యా గురుకుల విద్యార్థులతో సంభాషించి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. గురుపుత్రికలు రాధ, కందర్ప రమ యూఎస్ఏకు చెందిన ప్రముఖ రచయిత మిచల్ బైడెన్ రచించిన గాడెస్ అండ్ ద గురు గ్రంథాన్ని కీరవాణికి అందజేశారు.

రెవెన్యూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్


మహారాణిపేట: జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, జేసీ కె. మయూర్ అశోక్ ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాథరావు, సెక్రటరీ రమేష్‌లతో కలిసి డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ డి.రాజేంద్ర వర్మ, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు శ్యామ్ ప్రసాద్, శైలజ, సిటీ ప్రెసిడెంట్ నియోగ్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.

100 రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు : డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

పెందుర్తి: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత కోసం రూపొందించిన 100 డేస్ యాక్షన్ ప్లాన్‌ను ప్రతి ఒక్కరూ పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. సరిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెందుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను డీఈవో శుక్రవారం సందర్శించారు. సరిపల్లిలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన, రుచి చూశారు. అనంతరం పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి-1, 2లు కె.సువర్ణ, టి.మధుమూర్తి, హెచ్‌ఎంలు సువర్చల, చిన్నమ్మాయి, కిరణ్మయి, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





వేడుక ఏదైనా సందడి మాదే...

అంతా ప్రేమమయం

ప్రేమికుల దినోత్సవాన్ని నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు బహుమతులు ఇచ్చుకున్నారు. కొందరు లవ్ ప్రపోజ్ చేశారు. మరికొందరు సాగరతీరంలో వాలిపోయారు. ప్రేమ ముచ్చట్లలో మునిగిపోయారు. ప్రేమికుల కోసం సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. యువతీయువకులు లవ్ సింబల్ వద్ద ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడిపారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

- కీలకమైన డీఎస్‌వో పోస్టు ఖాళీ
- వెంటాడుతున్న అధికారుల కొరత
- పర్యవేక్షణ లోపంతో పీడీఎస్ బియ్యం పక్కదారి



పౌర సరఫరాకు ఇన్‌చార్జిలే దిక్కు

మహారాణిపేట: ప్రజా పంపిణీ వ్యవస్థను పర్యవేక్షించాల్సిన శాఖలో అధికారుల కొరత తీవ్రంగా ఉంది. కీలకమైన పౌర సరఫరాల శాఖను ప్రస్తుతం ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. జిల్లా స్థాయి నుంచి కింది స్థాయి వరకు పలు పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడం గమనార్హం. ప్రధానంగా జిల్లా సరఫరా అధికారి(డీఎస్‌వో), అసిస్టెంట్ సరఫరా అధికారి (ఏఎస్‌వో), పలు చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువుల పంపిణీని పర్యవేక్షించే వారు లేకపోవడంతో పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రస్తుతం విశాఖ అర్బన్, రూరల్ పరిధిలో 625 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. డీఎస్‌వో పరిధిలో జీవీఎంసీలోని కొంత భాగంతో పాటు మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మొదలైన ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో 5,12,619 తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులు అందించే బాధ్యత ఈ శాఖపై ఉంది. డీఎస్‌వో కార్యాలయంలో మొత్తం నలుగురు ఏఎస్‌వోలు, 19 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు అవసరం ఉంది. 625 చౌకధరల దుకాణాల పరిధిలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం 310 వాహనాలను వినియోగిస్తున్నారు.

ప్రధాన పోస్టుల ఖాళీ

డీఎస్‌వో వి.భాస్కరరావు గత నెల 26న బదిలీ అయ్యారు. అప్పటి నుంచి పౌరసరఫరాల శాఖ-2 సర్కిల్ ఏఎస్‌వో కల్యాణి ఇన్‌చార్జి డీఎస్‌వోగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఆమె డీఎస్‌వో కార్యాలయంలో పర్యవేక్షకురాలిగా కొనసాగుతున్నారు. ఇలా ఓ ఏఎస్‌వో మూడు పోస్టుల బాధ్యతలు చూస్తున్నారు.

ఇక గాజువాక ఏఎస్‌వోగా కృష్ణ, కంచరపాలెం ఏఎస్‌వోగా మురళీధర్ ఉన్నారు. భీమిలి, ఆనందపురం మండలాలకు ఇద్దరు సీఎస్ డీటీలు అవసరం కాగా.. ఒక్కరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పద్మనాభం, పెందుర్తి మండలాల బాధ్యతలను కూడా ఒక్కరే చూస్తున్నారు. వీరి పరిధిలో 19 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు అవసరం కాగా.. ప్రస్తుతం 16 మంది మాత్రమే ఉన్నారు. కీలకమైన పౌరసరఫరాలో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం వల్ల నిత్యావసర వస్తువుల పంపిణీ పక్కదారి పడుతోంది. రాష్ట్రంలో కీలకమైన విశాఖ జిల్లాలో కీలకమైన పోస్టులు ఇన్‌చార్జిలతో కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి. విభజన తర్వాత విశాఖ జిల్లా విస్తీర్ణం తగ్గింది. అలాగే మహా నగరంలో డీఎస్‌వో పోస్టు ప్రోటోకాల్ ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడ పనిచేయడానికి ఎవరూ ఇష్టపడడం లేదని తెలుస్తోంది.

విశాఖలో జీబీ సిండ్రోమ్ అలజడి



- ఆరు కేసుల నమోదు
- కేజీహెచ్‌లో ఐదుగురు, ప్రైవేట్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స
- అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడి
- అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

'గులియన్ బారే సిండ్రోమ్' ఇంతవరకూ పరిచయమే లేని ఈ పేరు.. ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. విశాఖలో వణుకు పుట్టిస్తోంది. నగరంలో ఇప్పటికే ఆరు కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య శాఖ అప్రమత్తమైంది. అసలేంటి ఈ గులియన్ బారే సింద్రోమ్? కరోనాలా ఇది కూడా అంటు వ్యాధా..? వైద్యులు ఏమంటున్నారు..? తెలుసుకుందాం.

-మహారాణిపేట

ఈ వైరస్ పేరు గులియన్ బారే సింద్రోమ్. దీని బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరం, వాంతులు కావడం లాంటి లక్షణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా సోకుతుంది. ఈ వ్యాధి ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపైనే తీవ్ర ప్రభావం చూపుతుంది. నాడీ వ్యవస్థను ఈ వైరస్ దెబ్బతీస్తుంది. దీంతో రోగి పక్షవాతం బారిన పడతాడు. అయితే సకాలంలో వైద్యం అందితే ముప్పు ఉండదు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే చాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకటి రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది.

గులియన్ బారే సింద్రోమ్ బాధితుల్లో ఐదుగురు కేజీహెచ్‌లోను, ఒకరు కలెక్టరేట్‌కు సమీపంలోని ఆయుష్మాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. జీబీ సింద్రోమ్ బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయంపై వైద్యాధికారులు దృష్టి పెట్టారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా రోగులు కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉండడంతో ఈ రోగులకు మెరుగైన చికిత్స అందించడానికి అధికారులు ప్రత్యేకంగా వైద్యులను నియమించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చేరిన ఐదుగురు రోగులకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. ఆయుష్మాన్ ఆస్పత్రిలో ఓ రోగి కోలుకుంటున్నాడని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

జీబీఎస్ అంటే ఏమిటి..?

జీబీఎస్ అంటే గులియన్ బారే సింద్రోమ్. ఈ గులియన్ బారే సింద్రోమ్ అనేది ఒక రకమైన ఆటో ఇమ్యూన్ (ఒక వ్యక్తిలోని రోగనిరోధక వ్యవస్థ తనలోని ఆరోగ్య కణాలనే శత్రువులుగా భావించి దాడి చేయడం) సింద్రోమ్. ఈ సింద్రోమ్ బారినపడిన వ్యక్తిలో ఉన్న రోగ నిరోధక వ్యవస్థ అతని నాడీ వ్యవస్థపైనే దాడి చేస్తుంది. అందుకే దీన్ని ఆటో ఇమ్యూన్ సింద్రోమ్ అని అంటారు. ఈ సింద్రోమ్‌వల్ల బాధితుడిలోని నరాలు, కండరాలు బలహీనంగా మారుతాయి. వివిధ రకాల వైరల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు సోకిన వారు.. అలాంటి సమయంలో ఈ గులియన్ బారే సింద్రోమ్ బారిన పడే ప్రమాదం కూడా ఉంది.

పిల్లలు అప్రమత్తంగా ఉండాలి

ఈ వ్యాధి చిన్నపిల్లలకు త్వరగా సోకుతుంది. చాలా పురాతనమైన వ్యాధుల్లో ఇది ఒకటి అని కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం పిల్లలకు ఎవరికీ ఈ వ్యాధి సోకలేదని తెలిపారు. ఒక వేళ జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరవు

- అన్నమయ్య జిల్లాలో ప్రేమోన్మాది దాడి దారుణం
- నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి

బీచ్‌రోడ్డు : అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో యువతిపై ఓ ప్రేమోన్మాది దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి అన్నారు. ఈ ఘటనపై ఆమె శుక్రవారం విశాఖలో మీడియాతో మాట్లాడారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతను ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోం మంత్రి గాలికి వదిలేశారన్నారు. ఏపీలో రోజుకొక సంఘటన జరుగుతున్నా హోం మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వందరోజుల్లో గంజాయి నిర్మూలిస్తామని ఊదరగొట్టారని, హోంమంత్రి సొంత నియోజకవర్గం మీదుగానే గంజాయి అక్రమ రవాణా జరుగుతుంటే ఏం చేస్తున్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రశ్నించారు.



వరుదు కల్యాణి

జీతాలివ్వండి మహాప్రభో..!

- 'పల్సస్' ఉద్యోగుల ఆందోళన
- డిసెంబర్ నుంచి జీతాలు ఇవ్వలేదని ఆవేదన
- పీఎఫ్ కూడా కట్టడం లేదని ఆరోపణ
- అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

విశాఖ సిటీ: జీతాల కోసం పల్సస్ ఉద్యోగులు మళ్లీ రోడ్డెక్కుతున్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని సంస్థ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉద్యోగ భవిష్య నిధి (పీఫ్) చెల్లించడం లేదని, కొంతమంది పీఎఫ్ అకౌంట్లను బ్లాక్ చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు సమాచారం లేకుండా హైదరాబాద్‌లో కొత్త అకౌంట్లు క్రియేట్ చేశారని ఆరోపిస్తున్నారు. వీటన్నింటిపై పోలీసులతో పాటు కార్మిక శాఖ, ఇతర సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు. పల్సల్ గ్రూప్ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు రెండు నెలలుగా ఆందోళన చేస్తున్నారు. గత నెలలో రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలపడంతో నవంబర్ జీతం అందించారు. డిసెంబర్ నుంచి పెండింగ్‌లో పెట్టారు. జనవరిలో కొంత జీతాన్ని అడ్వాన్స్‌గా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశారు. డిసెంబర్ జీతం కోసం యాజమాన్యం నుంచి ఎటువంటి సమాధానం లేకపోవడంతో మళ్లీ ఉద్యోగులు ఆందోళనకు దిగుతున్నారు. దీనిపై పల్సస్ గ్రూప్ సీఈఓ గేదల శ్రీనివాసుబాబును అడగగా డిసెంబర్ నెల జీతం చెల్లించే స్థితిలో కంపెనీ లేదని చేతులెత్తేసినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

ఉద్యోగుల పీఎఫ్‌లపై అనుమానాలు

జీతాలతో పాటు పీఎఫ్‌లపై కూడా ఉద్యోగులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది పీఎఫ్ అకౌంట్లను బ్లాక్ చేయడంతో పాటు ఉద్యోగులతో సంబంధం లేకుండా అనధికారికంగా అనేక పీఎఫ్ అకౌంట్లను తెరిచారని ఆరోపిస్తున్నారు. అలాగే ఉద్యోగులకు సమాచారం ఇవ్వకుండా హైదరాబాద్‌లో కొత్తగా పీఎఫ్ అకౌంట్లు సృష్టించారని, గత ఐదు నెలలుగా ఉద్యోగుల పీఎఫ్ నగదు జమ చేయడం లేదని చెబుతున్నారు. ఇప్పటికే బకాయి పడ్డ జీతాలు చెల్లించడంతో పాటు బ్లాక్ చేసిన పీఎఫ్ ఖాతాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

రుణాల మంజూరుకు సహకరించండి



బ్యాంకు అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

- బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సామాన్యులు, రైతుల ఆర్థిక అభ్యున్నతికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సరళతర విధానాలు పాటించాలని బ్యాంకర్లను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలను సకాలంలో రెన్యువల్ చేయాలని, రైతులకు, ఎం.ఎస్.ఎం.ఈ. ఔత్సాహికులకు అండగా నిలవాలని సూచించారు. రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అవలంభించాలని, దరఖాస్తుదారుకు వీలైనంత త్వరగా సమాధానం చెప్పాలని, పదే పదే బ్యాంకుల చుట్టూ తిప్పించుకోరాదని హితవు పలికారు. ఏదైనా సందర్భంలో దరఖాస్తును తిరస్కరిస్తే దానికి గల కారణాలను దరఖాస్తుదారుకు వివరించాలని సూచించారు. వ్యవసాయ, విద్యా సంబంధిత రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. పారిశ్రామిక ఔత్సాహికులకు, స్వయం ఉపాధి పొందే వారికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో భాగంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టులపై సమీక్షించారు. నాబార్డు ద్వారా అందే ఆర్థిక సాయం, అమలయ్యే ప్రాజెక్టులు, గృహ రుణాల మంజూరు, బ్యాంకు లింకేజీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్.బి.ఐ. ప్రతినిధులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ, పశుసంవర్ధక అధికారులు, డీఆర్డీఏ, యూసీడీ పీడీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇద్దరికి ముందస్తు బెయిల్

అల్లిపురం: నగరంలో సంచలనం రేపిన క్రికెట్ బెట్టింగ్ కేసులో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులకు శుక్రవారం హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరికి రూ.10 వేలు పూచికత్తుతో ఇద్దర్ని జామీనుగా లోయర్ కోర్టులో సమర్పించాలని ఉత్తర్వులో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో చాలామంది నిందితులను నగర పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కొంత మంది పరారీలో ఉన్నారు, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చెప్పుకొస్తున్నారు. ఈ తరుణంలో పరారీలో ఉన్న నిందితుల్లో బొబ్బిలి రవి (ఎ-4), పల్లా త్రినాథ్ (ఎ-5)లు హై కోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేయడంతో కోర్టు వారికి నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. హై కోర్టు బెయిల్ మంజూరు చేసే వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కూటమి నాయకుల అండతో కొంతమంది నిందితులు తప్పించుకు తిరుగుతున్నారని, వారికి పోలీసులు కూడా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేసును నీరుగార్చేందుకు, నిందితులను ఈ కేసు నుంచి తప్పించేందుకు పోలీసుల్లో కొంత మంది సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విశాలాక్షినగర్‌లో డ్రగ్స్ కలకలం

- రెండు గ్రాముల బ్రౌన్ షుగర్ స్వాధీనం
- ముగ్గురు యువకుల అరెస్ట్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో డ్రగ్స్ కలకలం రేగింది. కొందరు యువకులు మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో.. వారు ఆరిలోవ పోలీసులతో కలిసి నిఘా పెట్టారు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ శుక్రవారం తెలిపిన వివరాలివి.. ఒడిశాకు చెందిన ముగ్గురు యువకులు బ్రౌన్ షుగర్ తీసుకొచ్చి విశాలాక్షినగర్‌లో విక్రయిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు ఆరిలోవ పోలీసులతో కలిసి శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో విశాలాక్షినగర్‌లో ఆ యువకులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. షేక్ ముజబూర్, మహమ్మద్ చాంద్‌బాబు, షేక్ అనీష్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు గ్రాముల బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ యువకులు ఒడిశాలో అరబ్ అనే వ్యక్తి వద్ద బ్రౌన్ షుగర్ కొనుగోలు చేసి, విశాఖపట్నంలో విక్రయించడానికి తీసుకొచ్చారు. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్ట్ అక్రమం

- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా

అల్లిపురం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఆ పథకాలను అమలు చేయకుండా నమ్మక ద్రోహం చేస్తోందన్నారు. పథకాలు అమలు చేయాలని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్ట్ చేసి జైలు పాల్జేస్తోందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి సేవ చేసే నాయకుడన్నారు. ఏదో వంకతో అరెస్ట్ చేసి అతని కుటుంబాన్ని అవమానించడం భావ్యం కాదన్నారు. దీనిని హైకోర్టు సుమోటోగా తీసుకుని డీజీపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొందరు పోలీసులు టీడీపీ కార్యకర్తలుగా పని చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరుగుతుంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

ఆర్టీసీ డ్రైవర్లపై గురుతర బాధ్యత

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ


ఉత్తమ డ్రైవర్లు, సిబ్బందితో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ప్రజా రవాణా శాఖ అధికారులు

మద్దిలపాలెం: ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన గురుతర బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లపై ఉందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభ శుక్రవారం మద్దిలపాలెం డిపోలో జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బస్సులను సురక్షితంగా నడపాలని సూచించారు. బస్ బేలో పూర్తిగా ఎడమ వైపు మాత్రమే బస్సులు నిలిపి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రయాణికులను అనుమతించాలన్నారు. అవసరమైతేనే హారన్ మోగించాలని, డ్రైవర్లు తప్పనిసరిగా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గతంలో కంటే ఆర్టీసీ వల్ల జరిగే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని వెల్లడించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు సరైన శిక్షణ, డ్రైవింగ్‌లో మెళకువలు పాటించడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గుతోందన్నారు. సాంకేతికతకు అనుగుణంగా డ్రైవింగ్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఏయూ ప్రొఫెసర్, డీసీఎంఎస్ బి.మోహన్ వెంకట్ రామ్ మాట్లాడుతూ డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తూ దిశా నిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో జీరో యాక్సిడెంట్ సాధించిన గాజువాక డిపో మేనేజర్‌కు అవార్డు ప్రదానం చేశారు. పలువురు డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే కఠిన చర్యలు

అధికారులకు కలెక్టర్ హెచ్చరిక


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విశాఖ డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్ జరిగింది. ఫ్రీహోల్డ్ భూముల క్రమబద్ధీకరణ, ఆక్రమణల తొలగింపు, ఎన్‌వోసీ పత్రాల జారీ, సర్వే, మ్యుటేషన్ ప్రక్రియ, 22ఏ డీనోటిఫికేషన్, కోర్టు కేసులపై స్పందన, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల జారీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి.. అధికారులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్నేహ పూర్వక వాతావరణంలో సేవలు అందించాలన్నారు. అర్జీలను తిరస్కరించినట్లయితే.. అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. భూముల క్రమబద్ధీకరణ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కోర్టు కేసుల విషయంలో త్వరితగతిన స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

హేచరీల తనిఖీ


రొయ్య పిల్లలను పరిశీలిస్తున్న శంకరరావు

కొమ్మాది: బీచ్‌రోడ్డులోని మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంతాల్లోని హేచరీలను కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ డైరెక్టర్ పి. శంకరరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆక్వా కల్చర్, ఆక్వా సంబంధిత యూనిట్లలో యాంటీ బయోటిక్స్ వాడకాన్ని ప్రభుత్వ నిషేధించిన నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఈ కేంద్రాలను పరిశీలించింది. రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో వాడే మేతలు, ఇతర ఉత్పత్తులు సీఏఏ ద్వారా ధ్రువీకరించినవి మాత్రమే ఉపయోగించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపెడా డీడీ ప్రసాద్ నాయక్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అభిప్రియ, మత్స్య శాఖ అధికారి డి.లావణ్య, హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు పీవీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బేస్ విక్టువలింగ్ యార్డ్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు

సింధియా : భారత నావికాదళానికి 70 ఏళ్ల విశేష సేవలందించిన బేస్ విక్టువలింగ్ యార్డ్‌కు ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. భారతనేవీ రౌండ్-ది-క్లాక్ పేరుతో బేస్ విక్టువలింగ్ యార్డ్ వద్ద ఒక స్థూపాన్ని నిర్మించారు. శుక్రవారం అధికారులు కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు.

అవహేళనగా మాట్లాడి.. హత్యకు గురై..

- మందుబాబుల గొడవలో విషాదం
- ఇద్దరూ ఆటోడ్రైవర్లే..


శ్యామ్ చికిత్స పొందుతున్న సమయంలో వివరాలు సేకరిస్తున్న సీఐ(ఇన్‌సెట్) శ్యామ్(ఫైల్)

మల్కాపురం: అవహేళనగా మాట్లాడినందుకు ఓ వ్యక్తి హత్యకు గురై చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషాద సంఘటన మల్కాపురంలో చోటు చేసుకుంది. సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి.. మల్కాపురం పల్లివీధి ప్రాంతానికి చెందిన నీలాపు శ్యామ్ అలియాస్ శామ్యూల్(32) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గతంలో అతను హెచ్‌పీసీఎల్‌లో సొసైటీ కార్మికుడిగా పనిచేశాడు. మద్యం అలవాటు ఉన్న శ్యామ్ సొసైటీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ఆటోడ్రైవర్‌గా మారాడు. 2020లో వివాహం జరగ్గా.. భార్యతో సఖ్యత లేకపోవడంతో ప్రస్తుతం ఆమె శ్యామ్‌కు దూరంగా ఉంటోంది. కాగా.. గురువారం రాత్రి శ్యామ్ మద్యం సేవించి మల్కాపురం ఆటో స్టాండ్ వద్ద ఉన్నాడు. అదే సమయంలో 60వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన సీహెచ్ అప్పన్న రెడ్డి కూడా అక్కడ మద్యం తాగుతూ ఉన్నాడు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ అయిన అప్పన్న రెడ్డి నుంచి కూడా భార్య దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో శ్యామ్..అప్పన్న రెడ్డిని 'నువ్వు చేతకాని వాడివి.. అందుకే నీ భార్య నిన్ను వదిలి వెళ్లింది' అని అవహేళనగా మాట్లాడాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి, అది తోపులాటకు దారి తీసింది. తోపులాటలో శ్యామ్ చేష్టలతో అప్పన్న మరింత ఆగ్రహానికి గురయ్యాడు. మద్యం మత్తులో ఉన్న శ్యామ్ ఆటోలో నిద్రిస్తున్న సమయంలో.. అప్పన్న తన వెంట తెచ్చుకున్న కత్తితో అతనిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శ్యామ్‌ను స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఇంటికి వెళ్లిన శ్యామ్‌కు శుక్రవారం ఉదయం కత్తి తగిలిన చోట రక్తస్రావం అయింది. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో శ్యామ్ మృతి చెందినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడైన అప్పన్నను అదుపులోకి తీసుకుని, విచారించి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తోడుగా వెళ్లి.. తిరిగిరాని లోకాలకు..

- లారీ ఢీకొని ఒకరు మృతి


మృతుడు లక్ష్మణరావు

అక్కిరెడ్డిపాలెం: పరామర్శకు ఒకరికి తోడుగా అనకాపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా.. రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. సీతమ్మధారలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నవర లక్ష్మణరావు (54) వాచ్‌మన్‌గా, జి.రమణ (52) ధోబీగా పని చేస్తున్నారు. రమణకు చెందిన బంధువులను పరామర్శించడానికి ఇద్దరూ అనకాపల్లి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి స్కూటీపై సీతమ్మధార వస్తూ.. గాజువాక 100 అడుగుల రోడ్డు దాటి, పాతగాజువాక జంక్షన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో వెనుకనే వస్తున్న లారీ ఢీ కొట్టడంతో స్కూటీపై వెనుక కూర్చున్న లక్ష్మణరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలంలోనే ఆయన దుర్మరణం చెందాడు. రమణ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రమణను దగ్గరలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు వద్దు

- ఎల్ఐసీ పెన్షనర్ల ఆందోళన


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

డాబాగార్డెన్స్: బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడుల అనుమతికి వ్యతిరేకంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఐసీఆర్ఈఏ) ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్ఐసీ పెన్షనర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.మోహనరావు మాట్లాడుతూ బీమా రంగంలో శతశాతం విదేశీ పెట్టుబడులకు అవకాశం ఇస్తే కంపెనీపై విదేశీ భాగస్వామికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. దీని వల్ల పాలసీదారులకు ఆర్థిక భద్రత ఉండదని, ఫలితంగా పాలసీదారుల సొమ్ము ప్రమాదంలో పడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు దేశీయ పొదుపు చాలా కీలకమన్నారు. ఈ పరిస్థితుల్లో దేశీయ పొదుపుపై విదేశీ పెత్తనం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమన్నారు. ఇన్సూరెన్స్‌లో విదేశీ పెట్టుబడులు 74 శాతం వరకు పెట్టే అవకాశం ఇప్పటికే ఉన్నప్పటికీ, ఇంత వరకు ఉన్న 24 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో విదేశీ భాగస్వాముల వాటా 74 శాతానికి దరిదాపుల్లో లేదన్నారు. ఇప్పటివరకు ఇన్సూరెన్స్ రంగంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు 32 శాతం మాత్రమేనన్నారు. నిరసనలో ఐసీఆర్ఈఏ ప్రధాన కార్యదర్శి బీబీ గణేష్, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘాల నాయకులు ఎన్ఆర్ ఠాగూర్, తిరుమలరావు, ఉపాధ్యక్షుడు బీటీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఏఎస్ రవిశేఖర్, ఆచంట రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు మేజిస్ట్రేట్ అధికారాలు

- ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో..

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొంత మంది అధికారులకు ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ అధికారులిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సెక్టోరల్ అధికారులుగా ఇరిగేషన్ ఏఈఈ వి.అప్పల దాన కిశోర్, భీమిలి ఈవోఆర్డీ రమేష్ నాయుడు, జీవీఎంసీ డీఈఈ బి.భరణి కుమార్, వీఎంఆర్డీఏ డీఈఈ ఎస్.సుధీర్‌లను నియమించింది. ఇరిగేషన్ ఏఈఈగా పి.నళిని, వీఎంఆర్డీఏ డీఈఈ వి.ఆర్.రవిశంకర్, భీమిలి ఎంఈవో కె.రాజేష్ పట్నాయక్, జీవీఎంసీ జోన్-5 ఏఈఈ కె.రత్నాకర్ తదితరులను రిజర్వులో ఉంచారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు కోసం 12 మంది అధికారులను మండలాల వారీగా నియమించారు. భీమిలి గ్రామీణంలో అక్కడి ఎంపీడీవో(రూరల్), భీమిలి పట్టణంలో జోనల్ కమిషనర్(అర్బన్), ఆనందపురంలో అక్కడి ఎంపీడీవో, పద్మనాభంలో అక్కడి ఎంపీడీవో, విశాఖ రూరల్ ప్రాంతంలో జోన్-2 కమిషనర్, మహారాణిపేట ప్రాంతంలో జోన్-4 కమిషనర్, సీతమ్మధార ప్రాంతంలో జోన్-3 కమిషనర్, గోపాలపట్నం ప్రాంతంలో జోన్-8 కమిషనర్, ములగాడ ప్రాంతంలో జోన్-5 కమిషనర్, గాజువాక ప్రాంతంలో జోన్-6 కమిషనర్, పెదగంట్యాడ ప్రాంతంలో అక్కడి తహసీల్దార్ కార్యాలయం డీటీ, పెందుర్తి ప్రాంతంలో అక్కడి ఎంపీడీవో (పెందుర్తి)లు ఎన్నికల నియమావళిని పర్యవేక్షిస్తారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలికి ద్వైవార్షిక ఎన్నికలు పూర్తయ్యే వరకు వీరిని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రీరియల్ అధికారులుగా పిలుస్తారు.

ఆప్కోస్ రద్దు చేస్తే ఇక్కట్లే..

- గతంలో ఏజెన్సీలు తీవ్ర అన్యాయం చేశాయి..
- కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్


ఐక్యత చాటుతున్న కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఆప్కోస్ రద్దు చేస్తే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇక్కట్లేనని కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ టి.శ్రీనుబాబు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీలో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కోస్ రద్దుపై వచ్చిన వార్తలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బాధించాయని చెప్పారు. మళ్లీ ప్రైవేట్ ఏజెన్సీలంటే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు భయపడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వారికి మెరుగైన విధానం తీసుకురావాలన్నారు. గతంలో ఏజెన్సీలు ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేశాయని, ఇప్పటికీ ఉద్యోగులు నాటి రోజులను మరచిపోలేకపోతున్నారని అన్నారు. జిల్లాలోని అన్ని శాఖల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ అసోసియేషన్ బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, అసోసియేట్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఢిల్లీశ్వరరావు, ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ నాగేశ్వరరెడ్డి, జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు చినబాబు, జి.మహేష్‌రెడ్డి, శివకుమార్, ఈశ్వర్, బాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాస్తు యజ్ఞం


మండపారాధన చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ పూజారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శుక్రవారం శ్రీరాధాకృష్ణ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు వాస్తుయజ్ఞం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రధాన పూజారి గుణభద్ర దాస, బెంగళూరుకు చెందిన ఇస్కాన్ ఉపాధ్యక్షుడు కులశేఖర దాస, శ్రీవాస దాస, విశాఖ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస వాస్తు హోమం ప్రాధాన్యం గురించి వివరించారు. మూడు రకాల దోషాలను నివారించడానికి గృహప్రవేశ సమయంలో ఈ హోమం నిర్వహిస్తారని, ఐశ్వర్యం, ఆరోగ్యం, శాంతి చేకూరుతాయన్నారు. 300 మందికి పైగా భక్తులు పాల్గొన్న మొదటి రోజు కార్యక్రమంలో విష్వక్సేన ఆరాధన, శ్రీసంగ్రహణ, మట్టి తవ్వడం, వాస్తు మండల పూజ, హోమం ద్వారా కరణ్యాస, అగన్యాస, ఆచారాలు అనుసరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా సోమ హోమం నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ తరఫున అంబరీష దాస, యదురాజ దాస తదితరులు పాల్గొన్నారు.

'పాటల పందిరి' సత్యానంద్ ఇకలేరు

- ఆయన భౌతికకాయం ఏఎంసీకి అప్పగింత


సత్యానంద్ భౌతికకాయాన్ని ఏఎంసీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

పీఎంపాలెం/మహారాణిపేట: రోడ్డు ప్రమాదానికి గురైన జాతర వాకర్స్ పాటల పందిరి అధ్యక్షుడు సీహెచ్ సత్యానంద్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. సీఐ బాలకృష్ణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 5న సత్యానంద్ జీవీఎంసీ 8వ వార్డులోని ధర్మపురికాలనీ వైపునకు వెళ్తుండగా.. స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తు పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. అనంతరం మృతదేహాన్ని మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. కాగా.. మరణానంతరం తన మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు ఇవ్వాలని సత్యానంద్ నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో అఖిల భారత శరీర, అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అతని కుటుంబ సభ్యులను సంప్రదించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన మృతదేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాలకు అప్పగించారు. కాగా.. సత్యానంద్ ఆదర్శవాది. షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగి. ఒకప్పుడు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఎంతో సౌమ్యుడిగా పేరొందిన సత్యానంద్ మృతితో ఆయన్ని అభిమానించేవారు కంటతడి పెట్టారు.